క్లుప్తంగా

కోర్టు సమస్యలు పరిష్కరించాలి



మంత్రి పొన్నంకు వినతిపత్రం అందజేస్తున్న వేములవాడ అడ్వకేట్లు

వేములవాడ: వేములవాడ కోర్టులోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అడ్వకేట్లు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఇక్కడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి ఆవుదూత రజినికాంత్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్‌గౌడ్, విద్యాసాగర్‌రావు, గడ్డం సత్యనారాయణరెడ్డి, బోడ్డు ప్రశాంత్, నాగుల సంపత్, పంపరి శంకర్ తదితరులు ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన



బోయినపల్లి: మండలంలోని కోరెం, స్తంభంపల్లి పాఠశాలల్లో బుధవారం మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ శాఖ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలరక్షా భవన్ ఎల్‌సీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమన్నారు. పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, పీహెచ్‌బీ శ్రీనివాస్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

తంగళ్లపల్లి: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండెపల్లి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు బుధవారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెలా వేతనాలు ఒకటో తేదీన చెల్లించాలని, పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, హెల్త్‌కార్డులు జారీచేయాలన్నారు. ప్రిన్సిపాల్ మేడిపల్లి రమేశ్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, బాలరాజు, అంజయ్య, శోభారాణి, రేణుక, జ్యోతి, సరిత, ప్రభాకర్, శివకుమార్ రెడ్డి, కవిత, సత్యనారాయణ, నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి, ఎమ్మెల్యే రాక

ఇల్లంతకుంట: రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం ఇల్లంతకుంటలో పర్యటించనున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొంపల్లి రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లంతకుంటలో మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో వారు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: మండలం హరిదాస్‌నగర్‌లో బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 36 వాహనాలకు జరిమానా విధించారు. మద్యంతాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఏఎస్సై కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

జరిమానా

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని మల్లారం ప్రభుత్వ స్థలంలో ఉన్న చెట్లను విక్రయించిన వ్యక్తికి రెవెన్యూ శాఖ అధికారులు జరిమానా విధించినట్లు తెలిపారు. గతేడాది గ్రామంలోని దేవతల చెరువునుంచి అనుమతులు లేకుండా చెట్లు విక్రయించడంతో దీనిపై అదే గ్రామానికి చెందిన కొంపెల్లి శ్రీకాంత్ లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీనిపై రెండ్రో జులక్రితం రూ.3లక్షల 13వేలను సంబంధిత వ్యక్తికి జరిమానాగా విధించారు. ఇందులో రూ.45 వేలు మొదటి విడతగా చెల్లించినట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు. మిగితావి విడతల వారీగా చెల్లించేందుకు ఒప్పంద పత్రం రాసిచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామంలో పోచమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా నూతన పోచమ్మ ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. పండితులు సాగర్ పంతులు ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్కెట్ నిర్మాణం ఎప్పుడో ?

- మండలకేంద్రంలో రోడ్డుపైనే కూరగాయల అమ్మకాలు
- అవస్థలు పడుతున్న వ్యాపారులు, వినియోగదారులు
- మార్కెట్ నిర్మిస్తే ఉపయోగకరం



తంగళ్లపల్లిలో రోడ్డుపైన కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

తంగళ్లపల్లి: పేరుకు పెద్ద గ్రామ పంచాయతీ, దానికి తోడు మండలకేంద్రమైనా కనీసం కూరగాయల మార్కెట్ సౌకర్యం లేదు. దీంతో కూరగాయలు విక్రయించేవారు రోడ్డుపైన, పలుచోట్ల అమ్మకాలు జరుపుతూ ఇబ్బంది పడుతున్నారు.

ఎండలోనే విక్రయాలు

తంగళ్లపల్లిలో ఏళ్లుగా రోడ్డుపైనే కూరగాయలు అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో రైతులు, వినియోగదారులు ఎండా, వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఆప్రాంతంలో చలువ పందిళ్లు వేసుకునే అవకాశం కూడా లేని పరిస్థితి. దీంతో ఉదయం 10 గంటలల్లోపే అమ్మకాలు జరుపుతున్నారు. ఒకవేళ వర్షం కురిస్తే ఇక మార్కెట్ లేనట్లేనని అమ్మకందారులు వాపోతున్నారు.

మార్కెట్ నిర్మిస్తే మేలు

కూరగాయల మార్కెట్‌పై దృష్టిసారించకపోవడంతో గ్రామ పంచాయతీకి తైబజార్ రూపంలో వచ్చే ఆదాయం కూడా రావడం లేదు. తంగళ్లపల్లి మేజర్ గ్రామ పంచాయతీకి లేఅవుట్ రూపంలో చాలాచోట్ల విలువైన, కూరగాయల మార్కెట్‌కు అనుకూలమైన స్థలాలు ఉన్నాయి. కాగా మండల అభివృద్ధి అధికారులు ప్రస్తుత గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రధాన రహదారి పొడవునా మోడల్ మార్కెట్ నిర్మిస్తే ఇటు ప్రజలకు, వ్యాపారులకు మేలు జరగడమే కాకుండా గ్రామ పంచాయతీకి ఆతదాయం సమకూరే అవకాశం ఉంటుంది.

రోడ్డుపైనే విక్రయం



కొన్నేళ్లుగా కూరగాయలు విక్రయిస్తున్నా. రోజూ రోడ్డుపైనే అమ్మకాలు జరపడంతో ఎండ, వర్షం కురిసినప్పుడు ఇబ్బంది పడుతున్నాం. మార్కెట్ నిర్మిస్తామని అంటున్నారే తప్ప నిర్మాణం చేపట్టడం లేదు.

– నందిరి మణెవ్వ, కూరగాయల వ్యాపారి

మార్కెట్ నిర్మించాలి



కూరగాయల మార్కెట్ నిర్మించి అందుబాటులోకి వస్తే ఎంతో ఉపయోకరంగా ఉంటుంది. ఏ సమయంలోనైనా కూరగాయలు కొనుక్కునేందుకు వీలు కలుగుతుంది. ఉంటుంది. వ్యాపారుల ఇబ్బందులు కూడా తొలగుతాయి.

– నులుగొండ శ్రీనివాస్, తంగళ్లపల్లి

గ్రామపంచాయతీ వద్ద నిర్మించాలి



తంగళ్లపల్లి మేజర్ గ్రామపంచాయతీ ప్రధాన రహదారికి ఆనుకొని ఉంటుంది. జీపీ ఆవరణలో రోడ్డువైపు చాలాస్థలం ఉంది. రోడ్డు పొడవునా పంచాయతీ ఆవరణలో మార్కెట్ షెడ్లు నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుంది.

– బండి జగన్, తంగళ్లపల్లి



గంభీరావుపేట: మండలకేంద్రంలోని రైతువేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. కనీసం వాటిలోకి వెళ్లలేని విధంగా చెట్లపొదలు పెరిగాయి. ఎప్పుడు చూసినా తలుపులు మూసే ఉంటున్నాయి. రుణమాఫీ, ఇతర సమచారం కోసం నిత్యం ఎంతోమంది రైతులు వేదిక వద్దకు వస్తున్నారు. మరుగుదొడ్లు వినియోగించుకునే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– దోసల చంద్రం, గంభీరావుపేట

సంప్రదించాల్సిన అధికారి: సందీప్, ఇన్‌చార్జి వ్యవసాయాధికారి, గంభీరావుపేట, ఫోన్ : 9676957165

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9440243048, 9705346626

అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరు



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: బీజేపీ పొలిటికల్ గేమ్‌లో బీఆర్‌ఎస్ పావుగా మారిందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కే.కే మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కవితకు కోర్టు బెయిల్ రావడంపై న్యాయం గెలిచిందని బీఆర్‌ఎస్ నాయకులు ముందస్తు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ కుయుక్తులను కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటుందని స్పష్టంచేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌పై చేస్తున్న ఆరోపణలు, అసత్య ప్రచారాలు ప్రజలు నమ్మరన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్మూల స్వరూప, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పార్టీ సీనియర్ నాయకులు గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, గౌతమ్, కల్లూరి చందన, గోనె ఎల్లప్ప, శరణ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి



కోనరావుపేట: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శేఖర్ రెడ్డి



ముస్తాబాద్ : మాట్లాడుతున్న ఎస్సై గణేశ్

రుద్రంగి: విద్యార్థినులు, మహిళలు, బాలికలు లైంగిక దాడులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేరళ హైస్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాలల హక్కులు, పోక్సో చట్టం గురించి తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది, చైల్డ్ లైన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని కొలనూరు మార్గదర్శి విద్యానికేతన్‌లో విద్యార్థులకు ఎస్సై శేఖర్ రెడ్డి పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కరస్పాండెంట్, మండల చిరంజీవి, తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: బాలికలు చదువుతున్న చోటే కాకుండా ఇతర ప్రదేశాల్లో జాగ్రత్తగా ఉండాలని ఎస్సై గణేశ్ అన్నారు. మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ప్రత్యేకాధికారి శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మహిళల భద్రతే షీటీం లక్ష్యమని షీటీం కోఆర్డినేటర్ పద్మ అన్నారు. మండలకేంద్రంలోని కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోకరీలు ఎవరైనా వేధింపులకు గురిచేస్తే సమాచారం అందించాలన్నారు.

తంగళ్లపల్లి: విద్యార్థులు పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై దాస సుధాకర్ అన్నారు. మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోక్సో చట్టాలు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100, షీటీంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బండి ఉపేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మహిళలను లైంగికంగా వేధిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మండలంలోని కందికట్కూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల, పొత్తూరు గ్రామంలోని వివేకానంద హైస్కూల్‌లో లైంగిక వేధింపులపై ఎస్సై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తండా సమస్యలను పరిష్కరిస్తాం

వీర్నపల్లి: మండలంలోని లాల్‌సింగ్ తండాలో సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో పాటు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ. తండాసమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం వారిని గిరిజనులు ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, మండల బ్లాక్ ప్రెసిడెంట్ నర్సయ్య, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ హరిలాల్ నాయక్, పాల్గొన్నారు.

బెడిసికొట్టిన పైరవీ

- జీజేపీ నేతపై కేసు, రిమాండ్

సిరిసిల్లటౌన్: ఈజీమనీకి అలవాటుపడిన బీజేపీ నేత పైరవీ విషయం బెడిసికొట్టి కేసుపాలైన సంఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు వివరాలు. సిరిసిల్ల పట్టణానికి చెందిన బీజేపీ నేత ఒకరు పైరవీలు చేస్తూ కాలం వెల్లదీస్తుంటాడు. ఈక్రమంలోనే పట్టణానికి చెందిన ఓ మహిళ వ్యవసాయ భూమిలో బోరు వేయించాలనుకుని సదరు నేతను ఆశ్రయించింది. ఆమె వద్ద రూ.40వేలు తీసుకుని అధికారులు ఎవరూ అడ్డుకోకుండా పర్మిషన్ ఇప్పిస్తానని నమ్మించాడు. చాలా రోజులైనా పర్మిషన్ ఇప్పించకపోవడంతో తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆ మహిళ కోరగా.. ఆమెనే బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మంగళవారం అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఈ విషయమై టౌన్ సీఐ కృష్ణను వివరణ కోరగా అమాయకులను మోసం చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హక్కుల కోసం ఉద్యమించాలి

ఎల్లారెడ్డిపేట: వికలాంగులు హక్కులకోసం ఉద్యమించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ అన్నారు. మండలకేంద్రంలో వికలాంగుల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దీక్షలు, ధర్నాలు చేయడం వల్లే వికలాంగులకు రూ.4,016 పింఛన్లు అందుతున్నాయన్నారు. నాయకులు చంద్రయ్య, బాల ఎల్లయ్య, లింగం, నారాయణ,తదితరులు పాల్గొన్నారు.

'తమపై దాడికి దిగిన వ్యక్తులను అరెస్టు చేయాలి'

ముస్తాబాద్: తమపై దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పోతుగల్‌లో ఓ కుటుంబం ధర్నా చేపట్టారు. బాధితుడు రావుల దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం... పోతుగల్‌కు చెందిన రావుల దుర్గయ్యకు పక్కింటికి చెందిన మరో ముగ్గురితో నాలుగురోజుల క్రితం వివాదం తలెత్తింది. దీనిపై ఇరువర్గాలు ఘర్షణ పడగా, పోలీసులు వారిపై కేసులు నమోదు చేశారు. తనపై దాడిచేసి గాయపర్చిన వ్యక్తులను అరెస్టు చేయాలని కోరుతూ రావుల దుర్గయ్య బుధవారం కుటుంబంతో ధర్నా చేపట్టాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు పోతుగల్‌కు చేరుకొని దుర్గయ్య కుటుంబాన్ని శాంతింపజేశారు. దుర్గయ్యతో ఎస్సై గణేశ్ ఫోన్‌లో మాట్లాడి న్యాయం చేస్తామని, కేసులు నమోదు చేశామని తెలపగా ధర్నా విరమించారు. ఎస్సై గణేశ్ మాట్లాడుతూ నాలుగురోజుల క్రితమే రావుల దుర్గయ్య మరికొంత మందిపై కౌంటర్ కేసులు నమోదు చేశామన్నారు. విచారణ జరుగుతున్న సమయంలోనే ధర్నా చేస్తున్నారని, దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధిలో శ్రావణ మాసం సందర్భంగా బుధవారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	03	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	18	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	03	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	05	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	04	560
నందీశ్వర సూట్స్	03	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	18	448
పార్వతీపురం స్పెషల్	14	672
పార్వతీపురం సాధారణ	10	336

– వేములవాడ

రుణమాఫీపై వ్యవసాయాధికారుల సర్వే



గంభీరావుపేట: వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

గంభీరావుపేట: మండలంలోని నాగంపేట, గోరింటాల గ్రామాల్లో బుధవారం వ్యవసాయ విస్తీర్ణాధికారులు రుణమాఫీ కోసం సర్వే నిర్వహించారు. రేషన్ కార్డులేని రైతుల కుటుంబసభ్యుల వివరాలను సేకరించి నిర్ధారణ చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు సందీప్, సాయితేజ పాల్గొన్నారు.

వేములవాడరూరల్: ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీని చేసిన విషయం తెలిసిందే. ఇందులో కొందరికి డబ్బులు జమకాకపోవడంతో జిల్లా అధికారుల ఆదేశాలతో మళ్లీ సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంలలో ఏవో సాయికిరణ్ ఆధ్వర్యంలో రైతుల వద్దకు వెళ్లి నేరుగా సర్వే చేపట్టారు.

రుణమాఫీకి దరఖాస్తులు చేసుకోవాలి

వీర్నపల్లి: రుణమాఫీ కాని రైతుల కోసం మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ విస్తరణ అధికారి ఫజిల్ అన్నారు. మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలో రుణాలు తీసుకున్న 88 మంది రైతుల పేర్లు రేషన్ కార్డులో లేనందున వారికి రుణమాఫీ కాలేదన్నారు. బుధవారం 21 దరఖాస్తులు వచ్చాయని, మిగతా రైతులు కూడా దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని వంతడుపుల, గాలిపెల్లి వ్యవసాయ క్లస్టర్ గ్రామాల్లో రుణమాఫీలో భాగంగా రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించారు. రైతుల నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నారు. మండల వ్యవసాయ అధికారి సురేశ్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఐదు బ్యాంకులకు సంబంధించి 417 మంది రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ సేకరించనున్నట్టు పేర్కొన్నారు. వంతడుపుల వ్యవసాయ క్లస్టర్ విస్తరణ అధికారి గంగ, గాలిపెల్లి క్లస్టర్ విస్తరణ అధికారి అర్చన, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై ఫిర్యాదు

సిరిసిల్లటౌన్: మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ..పట్టణంలోని శివనగర్ కమ్యూనిటీ హాల్‌ను ప్రైవేటు వ్యక్తులకు అద్దెకిచ్చిన మొత్తాన్ని మున్సిపల్‌కి చెల్లించకుండా సొంతానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈవిషయమై మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిన విషయం వాస్తవమేనని, వైస్‌చైర్మన్‌పై చేస్తున్న ఆరోపణ వాస్తవం కాదని తమ విచారణలో తేలినట్లు పేర్కొన్నారు.

● విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

సిరిసిల్ల అర్బన్: పట్టణంలోని వెంకంపేట ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కౌన్సిలర్ కల్లూరి రాజు అభినందించారు. 10 జీపీఏ సాధించిన అక్షయకు రూ.10 వేల విలువగల ల్యాప్‌టాప్ అందించారు. ప్రధానోపాధ్యాయుడు దూస రఘుపతి రూ.10 వేలను ఉత్తమ ఫలితాలు సాధించిన ఆరుగురు విద్యార్థులకు అందించారు. అలాగే ఎన్ఆర్ఐ మధు అక్షయకు రూ.2వేలు అందించారు.

● గొర్రెలు మృత్యువాత

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని బాలరాజుపల్లికి చెందిన పోచవేని సత్తయ్యకు చెందిన 10 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..సత్తయ్య ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లి ఇటీవల వచ్చాడు. కుటుంబ పోషణ కోసం దాదాపు రూ.2లక్షలతో 10 గొర్రెలు కొనుగోలు చేశాడు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలం గట్లపై గడ్డిమందు కొట్టగా దీంతో ఆ గడ్డిని తిన్న గొర్రెలు బుధవారం సాయంత్రం పంట చేనులోనే మృతిచెందాయని సత్తయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. సత్తయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

● యువకుడి ఆత్మాహత్యాయత్నం

సిరిసిల్లటౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ కాంప్లెక్స్‌పై ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ..తంగళ్లపల్లి మండలం రాంచెంద్రాపూర్‌కు చెందిన బొడ్డు విజయ్ (17) బుధవారం మధ్యాహ్నం పురుగుల మందు డబ్బాతో పాతబస్టాండ్ కాంప్లెక్స్‌పైకి వెళ్లాడు. స్థానికులు 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వగా వెంటనే వారు అక్కడికి చేరుకున్నారు. కాంప్లెక్స్‌పైకి ఎక్కగా అప్పటికే యువకుడు పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను పోలీసులు విచారణ చేపడుతున్నారు.

● విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురి రిమాండ్

ఇల్లంతకుంట: పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించినందుకు బీఆర్‌ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుర్ర సూర్య గౌడ్‌తో పాటు మరో నలుగురిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ... ఈనెల 23న రాత్రి ఆరెపల్లిలో డీజే పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారన్న సమాచారం మేరకు ఏఎస్ఐ సతీశ్‌కుమార్ బ్లూ కోల్ట్స్ సిబ్బందితో అక్కడికి వెళ్లారు. డీజే బంద్ చేయాలని చెప్పగా బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు బుర్ర సూర్య గౌడ్, బుర్రస్వామి, చరణ్ , సిరికొండ గ్రామానికి చెందిన నీలం మహిపాల్, రేపాకకు చెందిన పోతుగంటి సంజయ్ పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఎస్సై పేర్కొన్నారు. ఏఎస్ఐ సతీశ్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డీజే పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించినందుకు గాను కేసన్నపల్లికి చెందిన డీజే యజమాని హరీశ్‌పై కూడా కేసునమోదు చేశామన్నారు.

● ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

బోయినపల్లి: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని తపస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని మల్లాపూర్ హైస్కూల్ ఉపాధ్యాయుడు సాన రవీందర్ ఉద్యోగ విరమణ పొందగా కార్యక్రమానికి హాజరై రవీందర్ దంపతులను స్కూల్ హెడ్‌మాస్టర్ కే.రామారావు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రం, శ్రీనివాస్, షరిపొద్దిన్, గంగ విజయ, కుమారస్వామి తదితరులున్నారు.

● మద్యం మత్తులో సెల్ టవరెక్కిన యువకుడు

తంగళ్లపల్లి: మద్యంమత్తులో ఓ వ్యక్తి సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలం తాడూర్ గ్రామానికి చెందిన కొమురవెల్లి శ్రీనివాస్ బుధవారం మద్యంమత్తులో గ్రామంలోని సెల్ టవర్ ఎక్కాడు. అతడిని దిగాలని గ్రామస్తులు కోరినా కొంతసేపు టవర్‌పైనే హంగామా చేశాడు. తన వెంట జాతీయ జెండా తీసుకెళ్లి టవర్‌పైన తలకిందులుగా ఎగురవేశాడని గ్రామస్తులు ఆరోపించారు. కాసేపటికి టవర్ దిగిన శ్రీనివాస్‌ను టవర్ ఎందుకు ఎక్కావని అడగగా పొంతనలేని సమాధానం చెప్పాడు.

● బాధ్యతల స్వీకరణ

ఎల్లారెడ్డిపేట: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో డీఏవోగా బదిలీపై వచ్చిన బేగం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు ఎంపీడీవో సత్తయ్య పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా బేగం మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు సహకరించాలన్నారు. గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అధికారులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వేములవాడరూరల్: మోడల్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. వేములవాడ రూరల్ మండల బీజేపీ అధ్యక్షుడు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లాలో ఆదర్శ పాఠశాలలకు ఆర్టీసీ అరకొర బస్‌లు కేటాయించడంతో విద్యార్థులు సకాలంలో ఇళ్లకు చేరలేకపోతున్నారన్నారు. రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌కు చిత్తశుద్ధి ఉంటే ఆదర్శ పాఠశాలలకు బస్సుల సంఖ్య పెంచి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, ప్రధాన కార్యదర్శి బూరుగుపల్లి పరమేశ్, బూత్ కమిటీ కో కన్వీనర్స్ మంద రాజేందర్, తోట రాజశేఖర్, ఉపాధ్యక్షుడు రేండ్ల మహేశ్, మండల కార్యదర్శి గోపు ప్రవీణ్, లింగంపల్లి కుంటయ్య, ముస్కం సంజీవ్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి గౌతమ్, జంగం వంశీ, గుడిసె రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

వేములవాడఅర్బన్: వేములవాడ కిడ్స్ కాన్వెంట్ పాఠశాల పదో తరగతి విద్యార్థిని సఫియా మన్నాల్ త్రిదండి చిన్నజీయర్ స్వామి ప్రజ్ఞావికాస్ వ్యాసరచన పోటీల్లో జిల్లాస్థాయి రెండో ర్యాంక్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ అభినందించారు.

● లారీ ఢీకొని యువకుడికి గాయాలు

వేములవాడ: పట్టణంలోని పాపన్నచౌక్‌లో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. సాయి అనే యువకుడు బైక్ పై వెళ్తుండగా పాపన్న చౌక్ వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలుకాగా చికిత్స నిమిత్తం 108లో ఆసుపత్రికి తరలించారు.